క్లుప్తంగా

అమరజీవి విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



తిరువూరు: స్థానిక చీరాల సెంటర్‌లో నూతనంగా నిర్మించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ పనులకు ఆదివారం ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. సర్వోదయ స్కూల్ ఎదురుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మార్పణ చేసిన అమరజీవి స్మారకార్థం ఆయన విగ్రహం ఏర్పాటు ముదావహమని ఆర్యవైశ్య సంఘ నాయకులు పేర్కొన్నారు.

రైతులపై దాడులు అమానుషం

నూజివీడు: పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల పరిష్కారం కోసం రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని హర్యానా పోలీసులు మూడో సారి అడ్డుకోవడాన్ని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. శంభూ సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన రైతులపై భాష్ప వాయువు ప్రయోగించి, జల ఫిరంగులతో రైతులను చెల్లాచెదురు చేయడంతో 17 మంది రైతులకు గాయాలయ్యాయని, ఇది దారుణమన్నారు. ఈనెల 17 వరకు అంబాలా పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేయటం ద్వారా బీజేపీ రైతాంగ వ్యతిరేక వైఖరి స్పష్టమైందని విమర్శించారు.

క్రిస్మస్ కిట్లు అందజేత



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసరాలు, పోషకాహారం కలిగిన క్రిస్మస్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మొగులూరి ఎలీషా మాట్లాడుతూ రానున్న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గ్రామంలోని దివ్యాంగులకు సహాయం చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఆదరించాలన్నారు. గ్రేస్ మినిస్ట్రీస్ కార్యదర్శి సుమలత, పెద్దలు అబ్రహాం, నాగరాజు, జోజి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గంపలగూడెం: గంపలగూడెం వికాస తరంగిణి ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, అనాథలు పదిమందికి దుప్పట్లు, పండ్లు, భోజనం పొట్లాలను అందజేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నూజివీడు: పట్టణంలోని బాపూనగర్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జయకిషన్ (జేకే) ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ జయకిషన్ చింతల నేతృత్వంలో సెమీ క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. డాక్టర్ జయకిషన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రేమ, దయ, క్షమా గుణాలను కలిగి ఉండి తోటి వారిని ఆదరించాలని చెప్పారు. శాంతియుతంగా సహజీవనం సాగించాలని చెప్పారు. ప్రభువు దయతో నూజివీడు పట్టణంలో సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరిస్తానన్నారు. పలువురు ఫాదర్‌లు పాల్గొన్నారు.

గ్రామాలలో ప్రచారం

మైలవరం: విశ్వ హిందూ పరిషత్, ఆంధ్రప్రదేశ్ హైందవ శంఖారావం బహిరంగ సభ జనవరి 5న మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం విమానాశ్రయం వద్ద జరుగుతుందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి తెలిపారు. మైలవరం బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంఖారావం సభలో పార్టీ రాష్ట్ర ప్రముఖులు పాల్గొంటారన్నారు. బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను మైలవరం మండలంలోని మంగాపురం, కొత్తగూడెం, పుల్లూరు, చంద్రగూడెం గ్రామాల్లో నాయకులు పంపిణీ చేశారని చెప్పారు. ధార్మిక సెల్ కన్వీనర్ పత్తి సాయి దాశరధి, జిల్లా బౌద్ధిక ప్రముఖ్ జుజ్జవరపు ఈశ్వర్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ గౌరీశంకర్, ధార్మిక సెల్ జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలుని కల్యాణం



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి మాస కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. 13 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. పలువురు భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

రబీ ఆశలు గల్లంతు

ఎగువన గోదావరి, దిగువన కృష్ణానది, స్థానికంగా తారకరామా ఎత్తిపోతల పథకం, మైలవరం నియోజకవర్గంలో 22 ఎత్తిపోతల పథకాలు ఉన్నా ఇవేమీ ఇప్పుడు రైతుల కష్టాలను తీర్చే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడం లేదు. వరదల కారణంగా ఖరీఫ్ నష్టపోయిన రైతులు రబీ సాగు చేసేందుకు సాగునీరు అందుబాటులో లేక దిక్కులు చూస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు గండ్లుపడి చెరువులన్నీ నీరు లేక వెలవెలబోతున్నాయి. సాగర్ జలాలు కూడా ఊరించి వెనక్కి తగ్గడంతో రబీ ఆశలు గల్లంతయ్యాయి. వరదలతో మేటలు వేసి, పైరులు కుళ్లిపోయి, మరో పంట సాగు చేసే అవకాశం లేక, ప్రభుత్వం ఇచ్చిన అరకొర సాయం పెట్టుబడి ఖర్చుపై వడ్డీకి కూడా సరిపోక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

- వరదలకు గండ్లుపడి నీరు లేక వెలవెలబోతున్న చెరువులు
- రబీ సాగుకు నీరులేక రైతుల ఆందోళన
- ఊరించి వెనక్కి తగ్గిన సాగర్ జలాలు
- ఖరీఫ్ వంట నష్టంతో అప్పుల ఊబిలో అన్నదాతలు



చిన్ననందిగామ పెద్ద చెరువులో అడుగంటిన నీరు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధిలో 38 చెరువులు ఉండగా 12,800 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. మైలవరం మండల పరిధిలో 24 చెరువులు ఉండగా 8,800 హెక్టార్ల వ్యవసాయ భూమి, రెడ్డిగూడెం మండల పరిధిలో 75 చెరువులు ఉండగా 13,600 హెక్టార్ల వ్యవసాయ భూమి, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 8 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల వచ్చిన బుడమేరు వరదకు జి.కొండూరు మండల పరిధిలో తొమ్మిది చెరువులు, మైలవరం మండల పరిధిలో 16 చెరువులు, రెడ్డిగూడెం మండల పరిధిలో ఏడు చెరువులకు గండ్లు పడి చెరువులలో నీరు దిగువకు వెళ్లిపోయింది. ఆ తర్వాత వర్షాలు కూడా వెనక్కి తగ్గడంతో గండ్లు పడిన చెరువులతో పాటు నియోజకవర్గంలోని 90 శాతం చెరువులలో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. వరదల కారణంగా చెరువులకు గండ్లు పడి వరద ఉధృతి పెరగడంతో నియోజకవర్గంలో 25 వేల ఎకరాలలో అనేక రకాల పంటలను రైతులు నష్టపోయారు. ఈ నష్టాలను పూడ్చుకునేందుకు రబీ సాగు చేసే అవకాశం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జాడలేని సాగర్ జలాలు

నాగార్జున సాగర్ నీళ్లు పలుమార్లు విడుదల చేసినప్పటికీ ఎన్ఎస్‌పీ కాలువకు మైలవరం నియోజకవర్గం చివరి ప్రాంతం కావడంతో జలాలు ఇప్పటి వరకు మైలవరం నియోజకవర్గాన్ని తాకలేదు. దీనితో నియోజకవర్గంలో 66.802 కిలోమీటర్ల మేర ఉన్న ఎన్ఎస్‌పీ కాల్వల కింద 27,966 ఎకరాల సాగుభూమి పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారనుంది. నూజివీడు, రెడ్డిగూడెం వరకు వచ్చిన సాగర్ జలాలు ఆగిపోవడంతో రైతులు సాగర్ జలాలపై పెట్టుకున్న ఆశలు కూడా ఆవిరయ్యాయి. మరలా సాగర్ జలాలు రావడం లేదా భారీ వర్షాలు కురిస్తే తప్ప నియోజకవర్గంలోని చెరువులలో కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు అందుబాటులో ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు

మైలవరం నియోజకవర్గంలో రైతులకు సాగు నీరు అందించడమే లక్ష్యం అంటూ 2014–19 మధ్య కాలంలో దశాబ్దాలుగా నీరు ప్రవహించని ఎన్ఎస్‌పీ కాల్వలు, బుడమేరు, వాగులపై 22 ఎత్తిపోతల పథకాలకు గానూ రూ.22.57 కోట్లను కేటాయించి నిర్మించారు. ఈ ఎత్తిపోతల పథకాలతో 33 చెరువులు నింపి 6,443 ఎకరాలకు సాగు నీరందించేందుకు నిర్మాణాలను రూపకల్పన చేశారు. అసలు నీరే అందుబాటులో లేని పులివాగు, బుడమేరు, ఎన్ఎస్‌పీ కాల్వలపై ఎత్తిపోతల పథకాలు నిర్మించడం వల్ల 90 శాతం ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. నియోజకవర్గంలోని తారకరామా ఎత్తిపోతల పథకం నిర్వహణను సైతం గాలికొదిలేయడంతో వీటిలో సగానికి పైగా మోటార్లు పనిచేయక దీని కింద ఉన్న 4,242 ఎకరాల ఆయకట్టు పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారింది.

సాగర్ జలాలు రాకపోతే కష్టాలే



సాగర్ జలాలు వస్తే చెరువులను నింపుకునే అవకాశం ఉంటుంది. వరదల వల్ల ఖరీఫ్ పంట తీవ్రంగా నష్టపోయాం. రబీ సాగు చేయాలన్నా చెరువులలో నీరు అడుగంటుతుంది. బోర్లలో నీటి మట్టం పడిపోతుంది. సాగర్ జలాలు వస్తే చెరువులను నింపడం వల్ల బోర్లలో కూడా నీటి మట్టం పెరుగుతుంది. రబీ సాగుకు ఇబ్బంది లేకుండా పోతుంది.

– రమావతు శ్రీను, రైతు, మునగపాడు గ్రామం

చెరువులు నింపకపోతే గడ్డుకాలమే



చిన్న నందిగామ పెద్ద చెరువులో నీరు అడుగంటింది. చెరువుకు గండ్లు పడటం వల్ల చెరువులో నీరంతా వృథాగా పోయింది. ఖరీఫ్ పంట నష్టపోయాం. రబీ సాగు చేద్దామన్నా చెరువులో నీరు లేదు. వేసవిలో పశువులు తాగేందుకు కూడా నీరు ఉండే అవకాశం లేదు. సాగర్ జలాలను నియోజకవర్గానికి తీసుకొస్తే సమస్య పరిష్కారమవుతుంది.

– పెండెం రాజేంద్రప్రసాద్, రైతు, చిన్ననందిగామ

నేడు 'మీకోసం'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ మోవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తిరువూరురూరల్: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ రవిబాబు తెలిపారు. ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రతిపాదించిన పనులపై చర్చించి తీర్మానిస్తారని చెప్పారు.

రేపు పెన్షనర్స్ డే

మైలవరం: పెన్షనర్స్ డే కార్యక్రమం మైలవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈ నెల 17న నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు జన్నవరపు నాగిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న, 75 సంవత్సరాలు జరుగుతున్న సంఘ సభ్యులను సన్మానిస్తామని చెప్పారు. సంఘం సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ పొదుపుపై విస్తృత ప్రచారం

ఇబ్రహీంపట్నం: జాతీయ ఇంధన వారోత్సవాల్లో భాగంగా ఎన్టీటీపీఎస్‌కు చెందిన పలు కాలనీల్లో విద్యుత్ పొదుపుపై ఆదివారం రెండో రోజు విస్తృత ప్రచారం చేశామని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు ఆదివారం తెలిపారు. ప్లాంటుతో పాటు కాలనీల్లో పోస్టర్ల ద్వారా విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణతో ఇంధన వనరులు భావితరాలకు అందించాల్సిన బాధ్యతను పోస్టర్ల రూపంలో ప్రచారం చేశారు. పలువురు ఇంజినీర్లు, ఉద్యోగులు ఆయా శాఖల కార్మికులకు అవగాహన కల్పించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట యోధులకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. అమరజీవి త్యాగాలను స్మరిస్తూ ఆత్మార్పణ దినోత్సవం కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 58 రోజుల పాటు కఠిన నిరాహార దీక్ష చేశారన్నారు. ఆశయ సాధనలో 1952 డిసెంబర్ 15న అమరజీవి అయ్యారని వివరించారు. ఆర్య వైశ్య సంఘం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల నివాళి

- **తిరువూరు:** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు తిరువూరులో ఆదివారం నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు గత్తం నాగేశ్వరరావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, జాకీర్, పరసా నెహ్రూ, మోదుగు ప్రసాద్, మూడు దుర్గా, మస్తాన్, నాయకులు, కార్యకర్తలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి పద్మావతి, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.
- **గంపలగూడెం:** గోసవీడు, ఊటుకూరు, పెనుగొలను, గంపలగూడెంలలో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా కార్యదర్శి నాళ్ళా చిన్న సత్యంబాబు, మండల సంఘం అధ్యక్షులు నాళ్ళా రామకృష్ణ, మండల నాయకులు కొత్తగుండ్ల నరసింహారావు, కాజా రవికుమార్, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు వనమా సుజాత, వికాస తరంగిణి అధ్యక్షురాలు సముద్రాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ధైర్యంతో ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు, నిజాం సంస్థానాన్ని ఉక్కు సంకల్పంతో భారతావనిలో విలీనం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ధైర్య సాహసాలే మనకు ఆదర్శమని ఈఓపీఆర్డీ బీవీ సత్యనారాయణ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. .



తిరువూరు శాఖా గ్రంథాలయంలో విజేతలకు బహుమతి ప్రదానం



గంపలగూడెం గాంధీ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



ముసునూరులో నివాళులర్పిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

రచయితలకు సామాజిక స్పృహ ముఖ్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



'భారతీయం' పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

తిరువూరు: రచయితలు సామాజిక స్పృహతో రచనలు చేయాలని కృష్ణా–గుంటూరు శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఈడే భరతకుమారి రచించిన 'భారతీయం' సరళ పద్యాల శతక పుస్తకాన్ని ఆదివారం స్థానిక సత్యా బీఈడీ కాలేజీ ఆవరణలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి సన్నగిల్లుతోందని, మొబైల్ వాడకంతో చదువుకు సమయం కేటాయించలేకపోవడంతో మంచి రచనలు సైతం వెలుగు చూడడం లేదని చెప్పారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా ఆధునిక సామాజిక పరిస్థితులు, జీవన స్థితిగతులపై రచనలు చేయాలని సూచించారు. సీనియర్ పాత్రికేయుడు కంతేటి చంద్రప్రతాప్ మాట్లాడుతూ ఛందస్సుతో కూడిన పద్యాల కంటే ప్రజలకు అర్థమయ్యే రీతిలో రచనలు చేయడం మంచిదన్నారు. భరత కుమారి సరికొత్త ప్రయోగాలతో రచనలు చేయడం అభినందనీయమన్నారు. తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, ఎంఈఓ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

950 మందికి వైద్య పరీక్షలు

తిరువూరు: క్రమం తప్పని ఆహారపు అలవాట్లతో వ్యాధులను నియంత్రించవచ్చని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక నాగార్జున స్కూల్ ఆవరణలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మధుమేహ రోగుల వైద్యశిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు వైద్యులు రవీంద్ర, సత్యతేజ, లక్ష్మణరావు, శివాజీ 950 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేవలం మందులతోనే ఆరోగ్య సంరక్షణ సాధ్యపడదని, ఉప్పు, పంచదార వాడకం సాధ్యమైనంత వరకు తగ్గించాలని, తృణ ధాన్యాలను తినాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు పాపారావు, సభ్యులు హరికృష్ణ, నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

- **మైలవరం:** ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విరజ బొబ్బూరి అన్నారు. మైలవరంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో విజయవాడ విబో హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ విరజ మాట్లాడుతూ హాస్పటల్ ద్వారా అందుతున్న సేవలను వివరించారు. డాక్టర్ విశ్వనాథ్, బొబ్బూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.
- **తోలుకోడు(మైలవరం):** తోలుకోడు గ్రామంలో దావులూరి సురేంద్ర ఆర్థిక సహాయంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు పల్లెపాము లక్ష్మీకుమారి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సర్పంచ్ ఓబుల రెడ్డి దుర్గారెడ్డి, అట్లా ప్రకాశరావు, నమ్మిక శివ నాగులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ముసునూరు: ధనుర్మాస ఉత్సవాలకు వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి ఆలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లోపూడిలోని కోదండ రామాలయం, గోపవరం నాగేంద్రస్వామి దేవస్థానం వద్ద ప్రతి రోజు తెల్లవారు జామున ప్రత్యేక అష్టోత్తరాలు, పూజాధికాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు కిరణ్‌కుమార్, చిట్టిబాబు తెలిపారు. నిత్యం అభిషేకాలు, సేవాకాలం, రంగనాథ సమేత గోదాదేవి అమ్మవారికి పూజా కైంకర్యాలు, తిరుప్పావై, నీరాజన మంత్రపుష్పాలు, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తామని వివరించారు.

- **ఆగిరిపల్లి:** శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ధనుర్మాసోత్సవాలు సోమవారం నుంచి జనవరి 14 వరకు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి తెలిపారు. ఆలయంలో జనవరి 10న ముక్కోటి ఏకాదశి, 11న కూడార్ై ఉత్సవం, 13న గోదాదేవి కల్యాణం, 14న మకర సంక్రమణ ఉత్సవం జరుగుతుందన్నారు. ప్రతిరోజు స్వామివారికి ఆలయ నిత్య పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు



ఆగిరిపల్లి: పోతవరప్పాడులోని ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో రెండు వారాలపాటు నిర్వహించిన ఏఐసీటీఈ అటల్ ప్రాయోజిత అధునాతన స్థాయి అధ్యాపక నైపుణ్య అభివృద్ధి జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఏఐసీటీఈ అటల్ అకాడమీ, న్యూఢిల్లీ వారితో కలిసి ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఎన్‌టీయూ హెచ్ఓడీ ఆఫ్ ఈఈఈ డాక్టర్ కె.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలక్ట్రిక్ వాహనాల్లో ఎలా ఉపయోగించాలో అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సాంబశివరావు ఆధ్వర్యంలో నున్న, సూరంపల్లి, గుంటూరులోని ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలను అధ్యాపకులు సందర్శించారు. సదస్సుకు 50 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన వివిధ విభాగాల అధ్యాపకులు హాజరయ్యారు. కళాశాల చైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని కృపావతికి డాక్టరేట్

మైలవరం: నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని సిరివెళ్ల కృపావతికి గుడ్ సమారిటన్ థియోలాజికల్ సొసైటీ, మనం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హనరరీ డాక్టరేట్ ప్రదానం చేశామని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డి కన్వెన్షన్ మాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేశామన్నారు. కాకినాడ కన్జూమర్ జిల్లా కోర్టు న్యాయమూర్తి రఘుపతి వసంత కుమార్, కాకినాడ డీఎస్పీ విష్ణు, నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు దాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ సమాజ సేవకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో పలువురు రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేసిన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు పంపిణీ చేశారు. రూ.8.87 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల నుంచి లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాలినడకన స్వామి సన్నిధికి

గంపలగూడెం: గంపలగూడెం ఎన్టీఆర్ కాలనీ నుంచి మేడూరు వీరాంజనేయస్వామి ఆలయానికి ఆరు కిలోమీటర్ల దూరం హనుమన్ భక్త మండలి ఆధ్వర్యంలో భక్తులు ఆదివారం కాలి నడకన వెళ్లారు. 108 పర్యాయాలు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా 18వ పర్యాయం ఈ విడత భక్తులు కాలినడకన వెళ్లి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

గంపలగూడెం: స్థానిక షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయంలో దత్త జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రామాలయ అర్చకులు శ్రీధరాచార్యులు, రామాచార్యులచే తొలుత గణపతి, దత్తాత్రేయ, వీరాంజనేయస్వామి, షిర్డీ సాయిబాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం చేశారు. భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: కొత్తూరు తండాలో ఆదివారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. గ్రామానికి సమీపంలోని అట వీ ప్రాంతంలో, మామి డి తోటల్లో సారా కా సేం దుకు సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊట స్థావరాలు గుర్తించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు వై. ఈశ్వరరావు, ఎం. ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



జి. కొండూరు శాగం శివరామిరెడ్డి జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు



కొండపల్లి జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

జి.కొండూరు/ఇబ్రహీంపట్నం: జి.కొండూరులోని శాగం శివరామిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల 1990–91 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు, కొండపల్లిలోని కానూరు వెంకట శివరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1968–69 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఆదివారం పండుగ వాతావరణంలో జరిగాయి. జి. కొండూరు గ్రామ శివారులోని పాత శివసాయి హోటల్ ఎదురుగా ఉన్న మామిడి తోటలో నాటి పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. అలాగే కొండపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలోకి రాగానే చిన్ననాటి మిత్రులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలుసుకుని క్షేమ సమాచారం తెలుసుకుని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆటపాటలు, విందు వినోదాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.